ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.8
సూర్యాపేట
3
శుక్రవారం 5 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (300.0450)	84,995	51,884
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.52 (4.07)	1,774.75	2,193.71
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.292 (43.1584)	35,800	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



ఒక్క బస్తా కోసం 12గంటలు పాట్లు

యూరియా కోసం మహిళా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంటే సుమారు 12గంటల పాటు ఎదురుచూసినా రైతులకు యూరియా అందలేదు. హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలో 25వేల టన్నుల యూరియా అవసరం ఉంది. నేటి వరకు సుమారు 7వేల టన్నులు మాత్రమే రైతులకు యూరియా సరఫరా చేయగలిగారు. రైతుల అవసరంలో మూడో వంతు మాత్రమే యూరియా సరఫరా చేశారు. రైతులు నాట్లు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా యూరియా సరఫరాలో యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తుందన్న విమర్శలు ఉన్నాయి. లక్షా 60వేల ఎకరాలకు సంబంధించి రైతులకు యూరియా డిమాండ్ ఏర్పడింది.

- (ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

ఇదేందయ్యా!

- యూరియా కోసం రైతుల ఇక్కట్లు
- జిల్లాలో తీవ్రమైన కొరత
- వరి సాగు పెరగడంతో డిమాండ్
- రోడ్డెక్కుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట): జిల్లాలో ఇటీవల వర్షాలు సమృద్ధిగా కురవడంతో మూసీ ప్రాజెక్టుతో పాటు చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఎడమ కాల్వకు సైతం నీటిని విడుదల చేశారు. కొంతకాలం వరకు వరి సాగు అనుమానంగా ఉన్న తరుణంలో వర్షాలు కురియడంతో జిల్లా రైతులు అత్యధికంగా వరి సాగుకే మొగ్గు చూపారు. మూసీ ప్రాజెక్టు, నాగార్జునసాగర్ ఎడమ కాల్వతో పాటు జిల్లాలోని చెరువులు, బోరు బావుల కింద అధిక సంఖ్యలో వరి సాగైంది. ఈ నేపథ్యంలో యూరియా అవసరం పెరిగింది.

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర కోటా తగ్గడంతో యూరియా కొరత ఏర్పడింది. ఫలితంగా రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి.

ఆయకట్టులో నీళ్ల ఆలస్యంగా రావడంతో రైతులంతా వరి సాగును ఒకేసారి చేపట్టారు. ముందస్తుగా నారు అందుబాటులో లేకున్నా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి వరి సాగును ప్రారంభించారు. ఒకేసారి అధిక మొత్తంలో వరి సాగు చేయడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. అనుకున్న మొత్తంలో జిల్లాలో యూరియా నిల్వలు లేకపోవడం రైతులంతా యూరియా కోసం రావడంతో కొరత తీవ్రమైంది. సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు దాటాక ఆయకట్టు, నాన్ ఆయకట్టు కింద నీటి వనరులకు అనుగుణంగా వరి సాగులో కొంత జాప్యమైంది. జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం 5,73,006 ఎకరాలు కాగా, అందులో వరి 4.82లక్షల ఎకరాల్లో సాగైంది. అందుకు అనుగుణంగా ఎరువుల సరఫరా లేకుండాపోయింది. ప్రధానంగా యూరియా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా, రాష్ట్ర స్థాయిలోనే సమస్య అధికంగా ఉండటంతో జిల్లాకు సరిపడా ఎరువులు రాలేదు. ప్రస్తుతం వరి చేలు తొలి దశతోపాటు కొన్ని చోట్ల పొట్ట దశలో ఉన్నాయి. ఇప్పుడు ఎరువుల అవసరం అధికంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు యూరియా కోసం తిరుగుతున్నా ఎక్కడా అందుబాటులోని లేని పరిస్థితి నెలకొంది. దీన్ని ఆసరా చేసుకొని కొంత మంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

60.734మెట్రిక్ టన్నుల యూరియా అవసరం

జిల్లాకు 60,734 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. ఇప్పటి వరకు 42వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. సుమారు 20వేల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది. అయితే అధికారుల లెక్కలు ఇలా ఉండగా, ఇంకా అధిక మొత్తంలో యూరియా అవసరమయ్యేలా ఉంది. అయితే జిల్లాకు సరిపడా యూరియా సరఫరా కావడంలేదు. దీంతో

- మిగతా 6వ పేజీలో...

తీరు మారడం లేదు!

- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని ఉద్యోగులు
- ఉమ్మడి జిల్లాలో చిక్కుతున్న అవినీతి తిమింగలాలు
- సగటున నెలకో కేసు నమోదు
- కీలకశాఖల్లో రాజ్యమేలుతున్న అవినీతి
- కేసుల విచారణలో జాప్యమూ కారణమే



నల్లగొండ,సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వశాఖల్లో అధికారులు, ఉద్యోగుల అవినీతి ఆగడం లేదు. తరచూ ఏసీబీకి పట్టుబడుతున్నా లంచాలు పుచ్చుకునేందుకు ఏమాత్రం వెనకంజ వేయడం లేదు. ఎలాంటి బెదురు లేకుండా ఏకంగా పనిచేసే కార్యాలయాల్లోనే లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్నారు. గురువారం నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారి చరితారెడ్డి తన కార్యాలయంలోనే మత్స్యసొసైటీ సభ్యుల నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడడం చర్చనీయాంశమైంది.

కీలకశాఖలకు అవినీతి మకిలీ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది సగటున నెలకో అవినీతి తిమింగలాన్ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరుసగా ఏసీబీకి పట్టుబడి ఉద్యోగాలు కోల్పోతున్నా మిగిలిన వారిలో ఏమాత్రం బెదురు ఉండడం లేదు. ఈ ఏడాది తాజాగా 8ఏసీబీ కేసులు నమదవ్వగా, గత ఏడాది 11 కేసులు నమోదయ్యాయి.

ఈ ఏడాది కేసులు ఇలా..

- జనవరి 12న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో పీడీఎస్ బియ్యం అక్రమరవాణా కేసులో ఎస్‌ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు రూ.70వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఏప్రిల్ 10న చింతలపాలెం ఎస్‌ఐ అంతిరెడ్డి బియ్యం స్టేషన్ బెయిల్ ఇచ్చే అంశంలో రూ.10వేల లంచం తీసుకుంటూ పట్టుబట్టారు.
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో నకిలీ వైద్యుల కేసు విషయంలో సూర్యాపేట సీఐ వీరరాఘవులు, డీఎస్పీ పార్థసారధి రూ.16లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి రూ.8వేల లంచం తీసుకుంటూ జూన్ 26న ఏసీబీకి చిక్కాడు.
- జూన్ 26న హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆపరేటర్ రూ.12వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీకేంద్రాల్లో మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి బిల్లుల చెల్లించాలన్నారు. ఇందిరమ్మ మొదటి, రెండో విడతలో మంజూరై పట్టాలు అందుకున్న లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బందిని ఎన్నికలకు సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో అప్పారావు, డీపీవో యాదగిరి, డీఎల్‌పీవో నారాయణరెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

భానుపురి: సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని గురువారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తనిఖీ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. పనులు డిసెంబరు వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వార్డుల్లోని రోగుల వద్దకు వెళ్లి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్, ఏడీఏ సెహ్రా, ఆర్‌ఎంవోలు తదితరులు ఉన్నారు.

సూర్యాపేటరూరల్: బోధనాభ్యసన మేళాలతో ప్రాథమిక స్థాయిలో బోధించడం సులభతరమవుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మునిసిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం సమీపంలో వికాస్ పార్మసీ కళాశాలలో ఏర్పాటుచేసిన మండలస్థాయి టీఎల్‌ఎం ప్రదర్శనను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, కో ఆర్డినేటర్ జనార్దన్, ఎంఈవోలు సక్కునాయక్, రవి, లింగయ్య, షరీఫ్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

- భారీ పోలీస్ బందోబస్తు నడుమ శోభాయాత్ర
- బందోబస్తులో 1,000మంది పోలీసులు
- భారీ క్రేన్లు, గజ ఈతగాళ్లు సిద్ధం



సూర్యాపేటలోని సద్దుల చెరువు వద్ద ప్రత్యేకంగా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులపాటు భక్తుల పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం గణేష్ నిమజ్జన శోభాయాత్రకు పోలీసులు భారీ బందోబస్తు, నిమజ్జన ప్రాంతాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 38 ప్రదేశాల్లో భక్తులు గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వినాయక నిమజ్జనాలు కొనసాగనున్నాయి.

భక్తులు గణేష్ విగ్రహాలకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాహనాల్లో నిమజ్జన శోభాయాత్రను నిర్వహించనున్నారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలతో శోభయాత్ర అనంతరం గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కొత్తపల్లి నర్సింహా ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్, తదితరశాఖలు నిమజ్జన ఏర్పాట్లలో పాల్గొన్నాయి. నిమజ్జన ప్రాంతాల వద్ద బారికేడ్లు, లైట్లు క్రేన్లు ఏర్పాటు చేశారు. కోదాడలో పెద్ద చెరువు వద్ద, మట్టపల్లిలో కృష్ణానది, మూసీ ప్రాజెక్ట్ వద్ద అత్యధికంగా గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

3,200లకు పైగా విగ్రహాలు

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 3,200లకు పైగా గణేష్ విగ్రహాలను భక్తులు ప్రతిష్ఠించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది విగ్రహాల సంఖ్య పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పెద్ద సైజు విగ్రహాల సంఖ్య కూడా పెరిగింది. భక్తులు ఖర్చుకు వెనకాడకుండా నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను పెద్ద సంఖ్యలో చేపట్టారు. కొంత మంది భక్తులు మూడు, ఐదో రోజున విగ్రహాలను నిమజ్జనం చేశారు. మిగతావారు శుక్రవారం నిమజ్జనం చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రధాన అవసరమైన క్రేన్‌లను తెప్పించారు. నిమజ్జన ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. చెరువులు, నదుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎవరైనా ప్రమాదవశాత్తు నీళ్లలో జారిపడితే వెంటనే రక్షించేందుకు జిల్లాలో మొత్తం 30 మంది గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. జిల్లా కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించే మార్గాలైన పొట్టి శ్రీరాములు సెంటర్,శంకర్ విలాస్ సెంటర్, పూల సెంటర్, పోస్టాఫీస్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, సద్దుల చెరువు, మినీ ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భారీ బందోబస్తు..

గణేష్ నిమజ్జనానికి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. ప్రశాంత వాతావరణంలో ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా గణేష్ శోభాయాత్ర నిర్వహించుకోవాలని ఎస్పీ నర్సింహా ఇప్పటికే సూచించారు. శోభయాత్రలో డీజేలను నిషేధించారు. గణేష్ విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలల్లో ఎక్కువ మంది ఉండకూడదు. అలాగే 15 ఏళ్లలోపు పిల్లలకు అనుమతి లేదు. పోలీసులు సూచించిన ప్రకారం నిమజ్జనానికి విగ్రహాలను తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. నిమజ్జన సమయంలో వీధుల్లో విద్యుత్ తీగలతో జాగ్రత్తలు పాటించాలి. మద్యం సేవించి ఘర్షణ వాతావరణం సృష్టిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకోనున్నారు. నిమజ్జనం చేసే ప్రదేశాలకు చిన్నారులను తీసుకెళ్లకూడదని ఎస్పీ సూచించారు. పలు ప్రాంతాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు చేశారు. స్పెషల్ పెట్రోలింగ్ వాహనాలు, క్విక్ రియాక్షన్ టీమ్స్, ఐడీ పార్టీ, షీటీమ్ బృందాలు ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నాయి. మొత్తం శోభాయాత్రను పోలీసులు

- మిగతా 6వ పేజీలో...

వారోత్సవాలను విజయవంతం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జునరెడ్డి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సాయుధ పోరాట ఉద్యమాన్ని అవమానించే విధంగా కుట్రలు చేస్తుందని ఆరోపించారు. భూమి కోసం, భుక్తికోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4వేల మంది అమరులయ్యారని గుర్తుచేశారు. 10లక్షల ఎకరాల భూమిని పంచి 3వేల గ్రామ స్వరాజ్యాలను నిర్మించిన చరిత్ర ఎర్రజెండాది అని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు పందిరి సత్యనారాయణరెడ్డి, మేకబోయిన శేఖర్, కొప్పుల రజిత, యాదగిరి, వీరారెడ్డి, సైదమ్మ, రాంరెడ్డి, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

హమ్మయ్య!
● జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన భారం 4

పత్తి దిగుమతులపై పన్ను రద్దు సరికాదు



ఆర్డీవో వేణుమాధవ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 4, (ఆంధ్రజ్యోతి): పత్తి దిగుమతులపై పన్ను రద్దు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు మల్లు నాగార్జున్‌రెడ్డి, మండారి డేవిడ్‌కుమార్, వరికుప్పల వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి దిగుమతులపై ఉన్న 11శాతం పన్నును రద్దు చేయడంతో రైతులు ఇబ్బందులు పడతారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలకు తలొగ్గిన ప్రధాని మోదీ పత్తి దిగుమతులపై ఉన్న దిగుమతి సుంకాన్ని రద్దు చేశారని ఆరోపించారు. పంటల పెట్టుబడిని కలిపి యాభై శాతం మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో వేణుమాధవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మట్టిపల్లి సైదులు, నజీర్, వెంకట్‌యాదవ్, నర్సయ్య,సైదులు, రజిత, నాగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, శేఖర్, లింగయ్య, మల్లయ్య, సైదులు, సత్యనారాయణరెడ్డి, రాములు, యాదగిరి పాల్గొన్నారు.

కమనీయం.. మట్టపల్లివాసుడి కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహుడి నిత్యాకల్యాణం గురువారం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జిత కైంకర్యాలు కొనసాగాయి. కల్యాణమూర్తులను పరిణయ వేదికపైకి అధిష్ఠింపజేసి పుణ్యాహవాచనం చేశారు. మాంగళ్యధారణ అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఆంజనేయచార్యులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర



అమరవరంలో ముత్యాలమ్మ జాతరలో ప్రభలతో రైతులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమరవరం గ్రామంలో గురువారం ముత్యాలమ్మ జాతర అత్యంత వైభవంగా సాగింది. మహిళలు ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామంలో బోనాలతో భారీగా ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. రైతులు ట్రాక్టర్లపై ప్రభలు కట్టి ప్రదర్శన చేశారు. ముత్యాలమ్మా.. దీవించమ్మా..! అంటూ భక్తులు వేడుకున్నారు. జాతరలో మాజీ సర్పంచ్ సుజాత అంజిరెడ్డి, డీసీకమిటీ మాజీ చైర్మన్ ఉస్తేల సైదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అన్నెం శౌరిరెడ్డి, లింగారెడ్డి, కామిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ గుర్వారెడ్డి, మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, లింగారెడ్డి, కర్నాటి వీరనాగిరెడ్డి, ఉస్తేల శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా?

● బస్తా యూరియా కోసం 12గంటల పాటు పాట్లు ● యూరియా కోసం మహిళా రైతుల అవస్థలు ● తెల్లవారుజాము 4 నుంచి సాయంత్రం వరకు నిరీక్షణ



మఠంపల్లిలో యూరియా కోసం క్యూలో చెప్పులు

క్యూలైన్‌లో చెప్పులు

మఠంపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో రైతులకు సరిపడా యూరియా దొరక్కపోవడంతో అందోళనకు దిగారు. తెల్లవారుజామున నుంచే చెప్పులు పెట్టి క్యూలైన్‌లో ఉన్న పడిగాపులు కాసిన రైతులు యూరియా పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్న తరుణంలో ఒక్కసారిగా గోదాంలోకి ఎగబడ్డారు.దీంతో కొంతసేపు రైతులకు తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి పోలీస్ పహారా నడుమ యూరియా పంపిణీ చేశారు. మండల నలుమూలల నుంచి వచ్చిన రైతులకు సహకార సొసైటీ కేవలం 300 బస్తాల యూరియా ఉండటంతో చాలామంది రైతులు నిరాశకు గురయ్యారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేస్తామని సహకార సంఘం అధికారులు తెలిపారు.

హుజూర్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘానికి బుధవారం 30 టన్నుల 666 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు గురువారం తెల్లవారు జామున 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైతులు యూరియా కోసం బారులు తీరారు. వెయ్యి మందికి పైగా రైతులు పట్టణంలోని సహకార సంఘం వద్దకు వచ్చి పడిగాపులు కాశారు. ముఖ్యంగా మహిళా రైతులు, వృద్ధులు ఉన్న మహిళా రైతులు కూడా యూరియా కోసం తరలి రావడం గమనార్హం. పురుషులతోపాటు మహిళా రైతులు కూడా యూరియా కోసం గంటల కొద్దీ బారులు తీరారు. కాగా హుజూర్‌నగర్ సహకార సంఘం పరిధిలో 6వేలకు పైగా సభ్యత్వం కలిగిన రైతులు ఉన్నారు. హుజూర్‌నగర్ సహకార సంఘం, వెపెమ్మ పరిధిలో సుమారు 18వేల ఎకరాల ఆయకట్టు ఉంది. హుజూర్‌నగర్, మాధవరాయనిగూడెం, గోపిదాపురం, అమరవరంతోపాటు ప్రాంతాల్లోని రైతులంతా యూరియా కోసం అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు ఒక క్యూలైన్, పురుషులు మరో క్యూలైన్‌లో నిల్చున్నారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం 4 గంటల వరకు యూరియా అందజేయగా సుమారు 150 మందికి పైగా రైతులు యూరియా దొరకక వెనుదిరిగారు. రోజంతా పొలాలకు వెళ్లకుండా పడిగాపులు కాసినా యూరియా దొరకలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తెల్లవారుజామున వచ్చిన రైతులు సాయంత్రం వరకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 12 గంటలపాటు రైతులు యూరియాకోసం ఎదురుచూసినా యూరియా లేకపోవడంతో నిరాశ, నిస్పృహలతో వెనుదిరిగారు.

రైతులపట్ల నిర్లక్ష్యంగా..

హుజూర్‌నగర్ పట్టణంలోని సహకార సంఘంలో పనిచేసే ఉద్యోగులు రైతుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. యూరియా కోసం వచ్చిన రైతులతో దురుసుగా దిగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని బడా బాబులు ముఖ్య, ఉద్యోగుల బంధువులకు మాత్రమే అత్యధికంగా ప్రాధాన్యమిస్తూ యూరియా బస్తాలు సరఫరా చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మండలంలో మొత్తం 5 సహకార సంఘాలు ఉండగా రైతులకు పూర్తి స్థాయిలో యూరియా కొరత ఏర్పడింది. రైతులకు వారానికి ఒకటిరెండుసార్లు మాత్రమే యూరియా సరఫరా చేస్తున్నారు.

రెండు లక్షల ఎకరాల ఆయకట్టు

హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలో సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, అందులో లక్ష 30వేల ఎకరాలు వరి, 30వేల ఎకరాల్లో పత్తితోపాటు మిగిలిన ఇతర పంటలు సాగుచేస్తున్నారు. కాగా లక్షా 60వేల ఎకరాలకు యూరియా 25వేల టన్నులు అవసరం ఉంది. ఇప్పటివరకు కేవలం 7వేల టన్నుల యూరియా మాత్రమే ప్రభుత్వం రైతులకు సరఫరా చేసింది. మూడో వంతు మాత్రమే యూరియా సరఫరా కావడంతో రైతులు రెండు నెలలుగా ఎదురుచూస్తున్నారు.

సొమ్మసిల్లిన మహిళా రైతు

హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురానికి చెందిన దాసరి సీలువ రాణి అనే 55 ఏళ్ల మహిళా రైతు వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద యూరియా కోసం వచ్చి సొమ్మసిల్లి పడిపోయింది. గురువారం తెల్లవారు జామున 4 గంటల నుంచి మహిళా రైతులు కూడా క్యూలో ఉన్నారు. కాగా తెల్లవారుజామున వచ్చిన ఆమె ఆహారం తీసుకోలేదు. కాగా రైతులు యూరియా కోసం పెద్ద ఎత్తున తరలిరావడంతో ఒక్కసారిగా స్పృహతప్పింది. పక్కనే ఉన్న రైతులు మంచినీళ్లు తాగించారు. 10 నిమిషాల అనంతరం తేరుకున్న ఆమె యూరియా తీసుకోకుండానే వెనుదిరిగింది.



తుంగతుర్తిలో యూరియా కోసం క్యూలో చెప్పులు

పడరాని పాట్లు

తుంగతుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియాకోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులుగా ఇదిగో యూరియా.. అదిగో యూరియా వస్తుందంటూ రోజు సహకార బ్యాంకు వద్దకు వచ్చి వెళుతున్నారు. గురువారం యూరియా లారీ సేవా సహకార సంఘానికి వచ్చిందని తెలియడంతో ఉదయం నుంచి రైతులు క్యూలో నిలబడ్డారు. క్యూలో నిలబడే ఓపిక లేకపోవడంతో రైతులు తమ చెప్పులను క్యూలో పెట్టి పక్కకు, నీడకు కూర్చున్నారు. మరి కొంతమంది ఎండలో నిలిచి తమ వంతు వచ్చేవరకు వేచి ఉండి ఒక్కో బస్తా తీసుకొని వెళ్లారు.



హుజూర్‌నగర్‌లో యూరియా కోసం వృద్ధులు, మహిళల నిరీక్షణ

హుజూర్‌నగర్‌లో సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు

బారులు తీరి...

కట్టంగూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులో యూరియా కోసం పీఏసీఎస్ వద్ద రైతులు గంటల తరబడి బారులుతీరారు. ఉదయం తెల్లవారుజాము నుంచి యూరియాకోసం అధిక సంఖ్యలో రైతులు ఎగబడ్డారు. దీంతో కట్టంగూరు ఎస్ఐ రవీందర్ పోలీస్ సిబ్బందితో వచ్చి పోలీసుల పర్యవేక్షణలో యూరియాను పంపిణీచేశారు. కట్టంగూరుకు గురువారం 444 యూరియా బస్తాలు రాగా ఒక్కొక్క రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి గిరి ప్రసాద్ తెలిపారు.

సజావుగా పంపిణీ

ఆత్మకూర్(ఎస్), నెమ్మికల్ కేంద్రాల్లో 25 మెట్రిక్ టన్నుల యూరియా రాగా, ఒక రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయాధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. మండల వ్యవసాయాధికారి దివ్య, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో రైతులకు యూరియా ను పంపిణీ చేశారు. మరో 30 మెట్రిక్ టన్నుల యూరియా గురువారం రాత్రికి వస్తుందని, శుక్రవారం నెమ్మికల్, ఆత్మకూర్(ఎస్) పీఏసీఎస్ కేంద్రాల వద్ద పంపిణీ చేస్తామని ఏఓ దివ్య తెలిపారు.

అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా



మాడ్గులపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై రైతులు యూరియాకోసం గురువారం రోడ్డెక్కారు. యూరియా మండల కేంద్రానికి తక్కువ మోతాదులో పంపించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం 200 బస్తాల యూరియా రావడంతో ఆధార్‌కార్డుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేయడంతో రైతులకు యూరియా సరిపోకపోవడంతో రైతులు చేసేదిమి లేక అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై గంటసేపు అందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని వ్యవసాయశాఖతో మాట్లాడి ఒక లారీ యూరియాను జిల్లాకేంద్రం నుంచి రప్పించడంతో అవి కూడా రైతులకు పంపిణీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందిస్తామని వ్యవసాయాధికారులు చెప్పడంతో అందోళన విరమించారు.

పోలీసు పహారా నడుమ

ఆలేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణంలోని సింగిల్‌విండో ఆధ్వర్యంలో గురువారం యూరియా సరఫరా చేపట్టగా మండలంలోని రైతులు ఎగబడ్డారు. రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఎగబడడంతో కార్యాలయ ఉద్యోగులు పంపిణీ చేయడం కొద్దిసేపు నిలిపివేశారు. క్యూలో వరుసగా యూరియా పంపిణీ చేస్తామన్నారు.

దాంతో రైతులు క్యూలైన్‌లో నిలబడడంతో పోలీసులను రప్పించి వారి ఆధ్వర్యంలో యూరియా పంపిణీని రైతుకు ఒకటి చొప్పున పంపిణీ చేశారు. సుమారు 450 బ్యాగుల యూరియా స్టాక్ రావడంతో కేవలం మూడు గంటల్లోనే పంపిణీ పూర్తి చేశారు. క్యూలో నిలబడిన రైతులు కొందరికి యూరియా లభించకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. త్వరలోనే యూరియా మరింత స్టాకు రానుందని, దాంతో యూరియా కొరత తీరిపోతుందని రైతులు అందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఆగ్రహించిన రైతులు

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి సాగుకు సిద్ధమైన రైతన్నకు అందుబాటులో ఉండేలా యూరియా అందించాల్సిన ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. నాటు వేసిన 25 రోజుల్లో యూరియా చల్లాల్సిన రైతులకు యూరియా కొరత ఏర్పడడంతో పంట నష్టపోయే పరిస్థితులు దాపురించాయి. దీంతో ప్రభుత్వ విధానంపై అన్నదాతలు ఆగ్రహిస్తున్నారు. గురువారం మండలంలోని తుంగపాడు పీఏసీఎస్ పరిధిలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. హుజూర్‌నగర్-జడ్చర్ల రహదారిపై తుంగపాడు బ్రిడ్జి వద్ద ధర్నా చేపట్టి నిరసన వ్యక్తంచేశారు. మండలంలో 42,500 ఎకరాల వరిసాగు చేపడుతుండగా, ఐదు పీఏసీఎస్‌లు, 46 గ్రామ పంచాయతీలకు చెందిన రైతులకు సమయానుకూలంగా యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తుంగపాడు బ్రిడ్జిపై సుమారు గంటన్నరకు పైగా రైతులు ధర్నా చేయడంతో జడ్చర్ల-కోదాడ 167 జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. రూరల్ పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకొని రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు అందోళన విరమించారు.

రామన్నపేటలో రాస్తారోకో

రామన్నపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట యూరియా అందించాలని రైతులు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు ఎరువుల షాపు డీలర్లతో కుమ్మక్కై యూరియాను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వచ్చిన అరకొర యూరియాను ఆసరాగా చేసుకొని ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగరాజు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమింపజేశారు. రైతులకు మద్దతుగా పలు పార్టీల నేతలు రాస్తారోకోలో పాల్గొన్నారు.



ఆలేరులో యూరియా కోసం క్యూలైన్‌లో నిలిచిన రైతులు




రామన్నపేటలో రైతుల అందోళన



మిర్యాలగూడ మండలం తుంగపాడు బ్రిడ్జి వద్ద అందోళన చేస్తున్న రైతులు

మూడు రోజులుగా మూతబడి



మోటకొండూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోటకొండూరు మండలంలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. యూరియా లేకపోవడంతో మూడు రోజులుగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం మూతపడింది. ఒక్క ఆధార్ కార్డుకు రెండు బ్యాగుల యూరియా ఇవ్వడంతో రైతులకు తిప్పలు తప్పడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కానీ పత్తి, వరిపంటలకు సరిపడా యూరియా అవసరం ఉండగా, రైతులు పొలం పనులు వదిలి యూరియాకోసం పీఏసీఎస్ కేంద్రాల వద్ద బారులు తీరుతూ పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి యూరియాను అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి




నర్సింహ(ఫైల్)

ఆత్మకూరు(ఎం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రాఘవాపురం గ్రామంలో వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతి చెందాడు. గురువారం ఈ ఘటన జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన ఏటెల్లి నర్సింహ(75)కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆతనికోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆత్మకూరు(ఎం) మండలం రాఘవాపురం గ్రామంలో ఓ వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న నర్సింహ కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు.

మనస్తాపంతో ఆత్మహత్య..

గుండాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాములు(75) మనస్తాపంతో బుధవారంరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాములుకు 3.24 ఎకరాల భూమి ఉంది. ఇందులో పిల్లల పేరున మూడు ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయగా, మిగతా 24 గుంటల విషయంలో కొంతకాలంగా తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన రాములు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తేజం రెడ్డి తెలిపారు.

బంగారు ఆభరణాల రికవరీ



రికవరీ చేసిన ఆభరణాలు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన పగిడిపల్లి అనిత ఈ నెల 3న భువనగిరిలో ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేలు బ్యాగులో పెట్టుకుని ఆటోలో మరిపోయింది. కొద్దిసేపటికి గ్రహించుకున్న ఆమె ఆదేరోజు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో భువనగిరి ఇన్‌స్పెక్టర్ రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఆమె ప్రయాణించిన ఆటోను గుర్తించి డ్రైవర్‌ను విచారించారు. ఈక్రమంలో ఆమె ప్రయాణించిన తర్వాత అదే ఆటోలో వెళ్లిన మరో ప్రయాణికుడు ఆటో డ్రైవర్‌కు ఫోన్‌పే ద్వారా కిరాయి చెల్లించాడు. ఈ మేరకు ఫోన్‌పే నెంబర్ ఆధారంగా ఆతడిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించి విచారించగా, ఆటోలో దొరికిన బ్యాగును పోలీసులకు ఇచ్చాడు. ఈమేరకు పోలీసులు అనిత దంపతులకు గురువారం ఆటోలో పోగొట్టుకున్న బ్యాగును అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్ఐలు లక్ష్మీనారాయణ, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

24 పీఏసీఎస్ చైర్మన్లకు బాధ్యతలు

● మరికొన్ని సొసైటీలపై నిర్ణయం పెండింగ్

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని 24 ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లకు తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఆదేవిధంగా మరో 14 సొసైటీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారా? లేదంటే చైర్మన్లకే బాధ్యతలు అప్పగిస్తారా? అనేది మరో వారం రోజుల్లో తేలనుంది. దీంతోపాటు ఇంకో ఐదు సొసైటీలపై కూడా ఎటూ తేల్చుకోలేదు.

హమ్మయ్య!

కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గింపునకు తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాల ప్రజల్లో ఆనందాన్ని నింపింది. ప్రస్తుతం నాలుగు స్లాబ్‌లలో అమలవుతున్న 5శాతం, 12శాతం, 18శాతం, 28శాతం స్థానంలో జీఎస్టీని తగ్గిస్తూ రెండు స్లాబ్‌లలో 5, 18శాతం అమలు చేయనున్నారు.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

● జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన భారం



తగ్గించిన జీఎస్టీ ఈ నెల 22నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పటంతో కొనుగోలు భారం తగ్గనుందని మధ్య తరగతి ప్రజలు ఊరట చెందుతున్నారు. వ్యాపారులు సైతం విక్రయాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉంటే జీఎస్టీ తగ్గింపుతో కొత్తగా లారీ కొనుగోలు చేసే యజమానికి రూ.5లక్షలు, ద్విచక్ర వాహనదారుడికి రూ.8వేల నుంచి రూ.17వేలు, పాఠశాల విద్యార్థులకు రూ.240, జీవిత బీమాపాలసీదారులకు రూ.2,125 భారం తగ్గనుంది. విద్యార్థులు కొనుగోలు చేసే నోట్, వర్క్‌బుక్, పెన్సిళ్లు, షార్ప్‌నర్లు, కంపాక్స్‌లపై జీఎస్టీ ఎత్తివేయటంతో తల్లిదండ్రులు ఆనందపడుతున్నారు. జీవిత బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేతతో బీమాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వినియోగించే ట్రాక్టర్, విడిభాగాలు, టైర్లపై జీఎస్టీని 18శాతం నుంచి 5శాతానికి తగ్గించటంపై వ్యవసాయానికి మంచి రోజులు వచ్చాయని అభిప్రాయపడుతున్నారు. ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషిన్లపై జీఎస్టీ 18 శాతం, తలనూనెలు, షాంపూలు, టూత్‌పేస్టులు, బ్రష్‌లు, సబ్బులతోపాటు, మెడికల్ సామగ్రిపై పన్ను భారాన్ని 5శాతానికి తగ్గించటంపై గృహిణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ లారీ యజమానులకు తగ్గనున్న భారం

ట్రాన్స్‌పోర్ట్ లారీ యజమానులు సంవత్సరంలో 10 కొత్త లారీలు తీసుకుంటారు. 16 టైర్ల లారీకి 28శాతం జీఎస్టీతో కలిపి రూ.54లక్షలు అవుతుంది. కేంద్రం జీఎస్టీ 28శాతం నుంచి 18శాతానికి తగ్గించటంతో లారీపై సుమారు రూ.5లక్షలు తగ్గనుంది. ఆ చొప్పున 10 లారీలపై రూ.50లక్షల భారం తగ్గనుందని లారీ యజమానులు చెబుతున్నారు. జీఎస్టీ తగ్గించకముందు చెల్లించే రూ.5లక్షలపై ఫైనాన్స్ సంస్థలకు ఫైనాన్స్ గడువుకాలం (ఐదేళ్లలో మరో రూ.2లక్షలు చెల్లించాల్సి ఉండేది. జీఎస్టీ తగ్గింపుతో లారీపై రూ.5లక్షలు, ఫైనాన్స్ చెల్లించే రూ.2లక్షలు మొత్తంగా రూ.7లక్షలు ఒక్కో లారీపై ఆదా అవుతాయని పేర్కొంటున్నారు. జీఎస్టీ తగ్గింపుతో భారీ ఊరట లభించినట్లయిందంటున్నారు.

ద్విచక్రవాహనదారులకు..

సూర్యాపేట జిల్లాలో ద్విచక్రవాహనాల కంపెనీలు సుమారు 80పైగా ఉన్నట్లు సమాచారం. ఒక్కో దుకాణంలో నెలకు 50 వాహనాలు విక్రయిస్తున్నారు. ఒక్కో ద్విచక్రవాహనం ఖరీదు రూ.70వేల నుంచి రూ.1.70లక్షలు ఉంటుందని వ్యాపారులు చెప్తున్నారు. కాగా రూ.70వేల వాహనానికి తగ్గిన జీఎస్టీ ప్రకారం రూ.7వేలు, రూ.1.70లక్షల వాహనంపై రూ.17వేలు తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా విని యోగదారులు వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపుతారని చెప్తున్నారు.



బీమా ప్రీమియం పాలసీదారులపై..

బీమా ప్రీమియంపై కేంద్రం జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయటంతో పాలసీదారులపై రూ.లక్షపై రూ.2,125 భారం తగ్గనుంది. ప్రస్తుతం పాలసీదారుడు రూ.20లక్షల పాలసీ తీసుకుంటే, సుమారు రూ.లక్ష ప్రీమియం చెల్లిస్తే, దానిపై 2.12శాతం జీఎస్టీ చొప్పున అదనంగా మరో రూ.2,125తో కలిపి రూ.1,02,125 చెల్లించాల్సి వచ్చేది. బీమా పాలసీపై జీఎస్టీ ఎత్తివేయటంతో పాలసీదారుడిపై అదనపు భారం తగ్గనుంది. దీంతో బీమా పాలసీదారులు, ఏజెంట్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా బడ్జెట్ (మధ్యతరగతి) పాఠశాలల్లో చదివే విద్యార్థులు సంవత్సరంలో నోట్, వర్క్‌బుక్, పెన్సిళ్లు, కంపాక్స్‌లపై సుమారు రూ.2వేల వరకు ఖర్చు చేస్తారు. కేంద్రం విద్యార్థులు వాడే నోట్ బుక్స్‌తోపాటు ఇతర వస్తువులపై జీఎస్టీ 12శాతం వేయటంతో రూ.240 అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం జీఎస్టీ ఎత్తివేస్తామని ప్రకటించటంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమేరకు ఖర్చు తగ్గనుంది. విద్యా సంఘాలు చెప్తున్నారు. కార్పొరేట్ స్కూల్ చదివే విద్యార్థులకు మరింత ఆదా కానుందని పేర్కొంటున్నారు.

ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గింపుతో..



ట్రాక్టర్లు, వాటి విడిభాగాలు, టైర్లపై జీఎస్టీ 12శాతం, 18శాతం నుంచి 5శాతం తగ్గించటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టైర్ల జత రూ.50వేలు ఉంటే 18 శాతం జీఎస్టీ చొప్పున రూ.9వేలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ 5శాతానికి తగ్గించటంతో రూ.2,500 భారం మాత్రమే పడుతుంది. దీంతో రైతుకు రూ.6,500 మిగులుతుంది. జీఎస్టీ తగ్గింపుతో రైతులపై భారం తగ్గనుందని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కార్లు, ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, తల నూనెలు, షాంపూలు, టూత్ పేస్టులు, బ్రష్‌లు, షేవింగ్ క్రీములు, సబ్బులపై జీఎస్టీ తగ్గింపుపై అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం నిర్ణయంతో భారం తగ్గినట్లే



లారీల కొనుగోలుపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతం తగ్గించటంతో ఒక్కో లారీ కొనుగోలుపై రూ.5లక్షల వరకు మిగులుతుంది. 10 లారీలు తీసుకుంటే 11వ లారీ ఖర్చు లేకుండా వస్తున్నట్లే. అంతేకాక రూ.ఐదు లక్షలపై ఫైనాన్స్ కంపెనీలకు వడ్డీల్లో రూ.2లక్షల వడ్డీ కడతాం. ఆ చొప్పున 10 లారీలపై మరో రూ.20లక్షలు ఆదా అవుతుంది. మొత్తంగా రూ.70లక్షల వరకు జీఎస్టీ తగ్గింపుతో ఆదా అవుతుంది. జీఎస్టీ తగ్గింపు రవాణా రంగానికి కలిసొస్తున్నట్టయింది.

కనగాల నాగేశ్వరరావు, ఏఎంసీ సభ్యుడు, కోదాడ

సైబర్ నేరగాడి బురిడీ

రాజాపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం పాముకుంటలో సైబర్ నేరగాళ్ల వలలో పడి వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్న ఘటన గురువారం జరిగింది. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పాముకుంట గ్రామానికి చెందిన మెలుగు సోమలింగంకు గురువారం సుబ్బారావు అనే పేరుతో బ్యాంక్‌నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పాడు. మీకు మూడేళ్లుగా ఫోన్‌పేనుంచి నెలకు రూ.350 రావాల్సి ఉందని తెలిపాడు. ఫోన్ పెట్టేయకుండా మీకు వచ్చే నెంబర్లు తెలపాలని నేరగాడు నమ్మబలికాడు. నమ్మిన బాధితుడు ఫోనుకు వచ్చిన నెంబర్ (ఓటీపీ) తెలపడంతో మొదటిసారి రూ.18,916, రెండోసారి రూ.16,812 ఫోన్‌పే ఖాతానుంచి డ్రా అయ్యాయి. మరోసారి నెంబర్లు చెప్తమనడంతో బాధితుడికి అనుమానం వచ్చి చూడగా రూ.35,728లు నేరగాళ్లు కాజేసినట్లు గుర్తించి రాజాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మోటార్ల దొంగలకు రిమాండ్

మఠంపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో వ్యవసాయ మోటార్లను దొంగిలిస్తున్న వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పి.బాబు అన్నారు. చోరీ పాల్పడుతున్న నిందితుల వివరాలను గురువారం వెల్లడించారు. మండలంలోని యాతవాకిళ్ల గ్రామానికి చెందిన షేక్ రాంబాబు మోటారు రిపేర్ రావడంతో గ్రామ సమీపంలోని మెకానిక్కు ఇచ్చాడు. అయితే దుకాణం ముందు ఉంచిన మోటారును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో యజమాని ఆగస్టు 30న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తుండగా.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం బొత్తలపాలెం గ్రామ పరిధిలోని సంతోష్‌నగర్‌కు చెందిన మెరుగు జగదీష్ మధిరాజ్, ఈదులగూడెంకి చెందిన గొర్రెల సాయి, శ్రీరామ్‌లు కారులో అనుమానాస్పదంగా కన్పించారు. పోలీసులు కారును తనిఖీ చేయగా అందులో మోటార్, కొన్ని వస్తువులు లభ్యమయ్యాయి. వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారించగా యాతవాకిళ్ల, కల్లెపల్లి గ్రామాల్లో వ్యవసాయ మోటార్లను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి ఆరు మోటార్లు, రెండు డంబెల్లు, కారును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ బాబు తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ శంకర్‌నాయక్, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్‌నాయక్, కృష్ణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

గురువు.. మార్గదర్శకుడు

» వినూత్న రీతిలో విద్యా బోధన
» విద్యార్థులను తీర్చిదిద్దే అలుపెరగని శ్రామికులు



సమాజంలో వివిధ వృత్తులను విద్యార్థులకు ప్రత్యక్ష బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన రాచకొండ ప్రభాకర్ 2008 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం మద్దిరాల మండలం గోరింట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు తరగతి గదిలో నేర్పిన విద్యతో పాటు ప్రత్యక్షంగా పాఠ్యాంశంలోని భావాన్ని అర్థం అయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ నేపథ్యం, వృత్తుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరిస్తుంటారు. కుమ్మరి వృత్తివారు తమ వృత్తుల్లో భాగంగా కుండలు చేసే విధానాన్ని ప్రత్యక్ష బోధనలో భాగంగా విద్యార్థులకు కుండలు చేసే ప్రదేశానికి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తారు. చేనేత, రజక, మంగలి, చెప్పులు కుట్టే వృత్తిదారుల వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పిస్తుంటారు. మాదక ద్రవ్యాలు వాడితే కలిగే అనార్థాలను విద్యార్థులకు వివరిస్తుంటారు. సెలవు దినాల్లో ప్రజలు అధికంగా ఉన్న చోట నల్లదుస్తులు వేసుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు.



డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయం

డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా సంవత్సర కాలంగా సెలవు దినాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా. విద్యార్థులకు ప్రత్యక్ష బోధనతో ఎంతో మేలు కలుగుతుంది. విద్యార్థులకు మెరుగైన విద్యను అందిచేలా కృషి చేస్తున్నా. విద్యార్థుల జీవితం ఉపాధ్యాయుడి చేతుల్లోనే ఉంది.

- రాచకొండ ప్రభాకర్, ఉపాధ్యాయుడు

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడం ఒక్క గురువుకే సాధ్యం. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్ది దేశ భవిష్యత్‌ను మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉంది. సమాజంలో మార్పు తేవాలని కొందరు ఉపాధ్యాయులు తమదైన శైలిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. సమాజాన్నీ చైతన్య పరుస్తూ ముందుకు సాగుతున్నారు. సమాజంలో ఉన్న చెడును పారదోలే సమాజిక కార్యకర్తలుగా కూడా తోడ్పతున్నారు. ప్రతివ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువులే ప్రధాన పాత్రను పోషిస్తారు. వారికి మంచి చెడులు చెబుతూ తీర్చిదిద్దుతారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనాలు.

ప్రైవేట్ నుంచి సర్కార్ బడికి మళ్లించి..

రాజాపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లెక్కల రవీందర్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. బదిలీపై ఆయన పాఠశాలకు వచ్చిన సమయంలో విద్యార్థుల సంఖ్యపూర్తిగా తగ్గిపోయింది. దీంతో ఆయన విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఆలోచించారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిపై నమ్మకం కలిగించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే 16మంది విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. పాఠశాలలోని 63మంది విద్యార్థులకు టై, బెల్ట్, షూస్‌ను సొంత డబ్బులతో అందజేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని రూ.లక్ష ఖర్చు చేయించి ఆట స్థలాన్ని పూర్తిగా చదును చేయించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న రవీందర్‌రెడ్డిని గ్రామస్థులు అభినందిస్తున్నారు.



ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి

దాతల సహకారం.. వినూత్న ఆలోచన.

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కంచర్ల హర్షవర్ధన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. మండలంలోని తాళ్ల సింగారం నుంచి 2024 జూలైలో బదిలీపై ఈ పాఠశాలకు వచ్చిన ఆయన ఆరు మాసాల పాటు ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేశారు. ఆ సమయంలో అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల సంఖ్యను 125కు పెంచారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు టీసీ తీసుకొని ఈ పాఠశాలలో ప్రవేశాలు తీసుకున్నారు. దాతల సహకారంతో రూ.లక్ష విలువైన మైక్‌సెట్, టేబుల్స్, ఇతర ఫర్నిచర్, విద్యార్థులకు టై, ఐడీకార్డులు సమకూర్చారు. ఒక ప్రైవేట్ టీచర్‌ను నియమించారు. విద్యార్థులకు అక్షర మాలలు సులభంగా అర్థమయ్యేందుకు సొంతంగా రూ.10 వేలు వెచ్చించి ఫ్లెక్సీ చార్ట్‌లను ఏర్పాటు చేయించారు. పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల సమాచారాన్ని తల్లిదండ్రులకు అందించి వాస్తవాలను తెలుసుకునే వారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్య ప్రాముఖ్యతపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుంటారు. 2023లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.



కంచర్ల హర్షవర్ధన్ రెడ్డి

వినూత్న ఆలోచనతో జాతీయ అవార్డు ..

ఢిల్లీలో రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోనున్న మారం పవిత్ర



జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత మారం పవిత్ర

పెన్‌పహాడ్ సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మారం పవిత్ర శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోనున్నారు. జీవశాస్త్రంలో ఆమె బోధన వినూత్నంగా ఉంటుందని విద్యార్థులు తెలిపా రు. ప్రతి పాఠ్యాంశాన్నీ విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరిస్తారు. ప్రయోగాల్లో సాంకేతికతను వినియోగిస్తారు. విద్యార్థులు శ్రద్ధగా వినడంతో పాటు ప్రయోగాలు చేసేందుకు ఇష్టపడుతున్నారు.

సాధించిన విజయాలు

- సీఐఈటీఎన్‌ఐఆర్‌టీ యూట్యూబ్ ఛానెల్ ద్వారా 2020-2021లో ఉపాధ్యాయులకు ఉపయోగపడే టూల్స్‌పై అవగాహన కల్పించారు.
- 2019లో విద్యావిధానాలపై జాతీయ స్థాయిలో సెమినార్ త్రుహాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ అనే అంశంపై ప్రసంగించారు. » 2017 నుంచి ఇప్పటి వరకు స్టేట్ ఇనిస్ట్యూటివ్ ఆఫ్ టెక్నాలజి ద్వారా జీవశాస్త్రంలో 14 డిజిటల్ పాఠాలను బోధించారు.

అందుకున్న అవార్డులు

- 2019లో అక్షర ఫౌండేషన్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2023లో నేషనల్ సైన్స్ డే రాష్ట్రస్థాయి అవార్డు
- 2023-24లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2025లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాల వైపు..



పాఠశాల గదిలో బొమ్మకు తెలుగు అచ్చులు, హల్లులు వేసి విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

మర్రిగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామానికి చెందిన లేంకలపల్లి వెంకటేశ్వర్లు మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విద్యార్థులకు సులభమైన రీతిలో క్రీడా పద్ధతిలో, నాటకీకరణ ద్వారా, కృతధార పద్ధతిలో బోధనలు చేస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పిల్లలను బడికి పంపించకుండా ఇంటి వద్దనే ఉంచుకుంటున్న వ్యవసాయ రైతుల వద్దకు వెళ్లి మీ పిల్లలను బడికి పంపించాలంటూ వ్యవసాయ పొలాలపనుల వద్దకు వెళ్లి చదువుపై అవగాహన కల్పించి తల్లిదండ్రులను ఒప్పించి పిల్లలను బడికి వచ్చే విధంగా చేశారు. ఇన్నోవేటివ్ కార్యక్రమాలు ద్వారా చదువు చెబుతారు. సేవలను గుర్తించి వేదాస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర తరపున తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు మీద హైదరాబాదులో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.

రీల్స్‌తో సులభతర బోధన



మోత్కూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం వై. కమలాకర్‌రెడ్డి సులభ పద్ధతుల్లో బోధన చేస్తుంటారు. 1992 నుంచి 1996 వరకు చదువు-వెలుగు కళాబృందంలో కళాకారుడిగా పనిచేశారు. 1996 నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వివిధ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన ఏడాదిగా పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. బడిబాట సందర్భంగా పిల్లలను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకునేలా స్వయంగా పాటలు రాసి, సంగీతం సమకూర్చుకుని పాడి వీడియోలు తీసి టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్న గ్రూపుల్లో అప్‌లోడ్ చేస్తారు. ఇప్పటి వరకు సుమారు 40పాటలు రాసి, వీడియోలు చేసి యూట్యూబ్‌లో, ఇతర గ్రూపుల్లో అప్‌లోడ్ చేశారు. టీఎల్‌ఎంలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో, విద్యార్థులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేసే వీడియోలు చేసి గ్రూపుల్లో అప్‌లోడ్ చేసి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో కూడా విద్యార్థులకు ఉపయోగపడేలా పలు పాఠ్యాంశాలపై వీడియోలు చేశారు. ఆయన వీడియోలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దీక్ష పోర్టల్ లోనూ అప్‌లోడ్ చేసింది. మద్యపానానికి అలవాటు పడిన కుటుంబాలు ఎలా దెబ్బతింటాయి, వారి పిల్లలు ఎలా తయారువుతున్నారు. లాంటి సామాజిక అంశాలపై రీల్స్ చేసి అప్‌లోడ్ చేశారు.

1999లో అప్పటి సీఎం చంద్రబాబు నుంచి, 2013లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, 2023లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లా స్థాయి బెస్ట్ ప్రాక్టిషనర్‌గా అవార్డు అందుకున్నారు. తీరిక సమయాల్లో రవీంద్రభారతి, త్యాగరాయ గానసభల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తుంటారు. పీఎంశ్రీలో పాలడుగు పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను మొక్కుబడిగా కాకుండా, కోతుల బెడద లేకుండా చుట్టూ, పైన ఐరన్ జాలితో ఫెన్సింగ్ చేయించారు. అందులో 14 రకాల కూరగాయలు, ఆకుకూరలు పండించి మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వండిపెడుతున్నారు.

సారథి పరివార్ డిజిటల్ సేవలు షురూ

» సారథితో వాహన సేవలు సులువు » డ్రైవింగ్ లైసెన్స్ సేవలు సులభతరం » ఎంవీఐ కార్యాలయానికి వెళ్లకుండానే సులభంగా

వాహన రిజిస్ట్రేషన్, పర్మిట్, పన్ను విధింపు. ఫిట్‌నెస్, మోటార్ డ్రైవింగ్ స్కూల్స్, లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర సేవలను పరివాహన్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ నేతృత్వంలో పోర్టల్‌లోని వాహన్, సారథి అప్లికేషన్ల ద్వారా డిజిటల్ సేవలు అందించే ప్రక్రియ కొనసాగుతోంది.

- ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ



పరివాహన్ పోర్టల్ ద్వారా ఆర్‌సీ పొందడం, డ్రైవింగ్ లైసెన్స్ సేవలు పొందడం, ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన చలాన్లు చెల్లించేందుకు కల్పించింది. 2006లో జాతీయ ఈ -గవర్నెన్స్ ప్రోగ్రాం కింద దీనిని చేపట్టినప్పటికీ నల్లగొండ జిల్లాలో ఇటీవలే సారథి అప్లికేషన్‌ను అమలు చేస్తుండగా, సాంకేతిక కారణాలతో 'వాహన్' పూర్తి స్థాయిలో అమలుకావడం లేదు.

పరివాహన్ పోర్టల్‌తో డిజిటల్ సేవలు

ఏకీకృత జాతీయ రవాణా వ్యవస్థలో భాగంగా చేపట్టిన పరివాహన్ ద్వారా వాహన యజమానులకు, డ్రైవర్లకు సులభంగా సేవలు పొందవచ్చు. పరివాహన్ పోర్టల్ లోని సారథి, వాహన్ అప్లికేషన్స్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు, వాహన వివరాలు, రిజిస్ట్రేషన్స్ సమాచారం, అనుమతులకు సంబంధించిన సమాచార సేవలతో పాటువాహన సంబంధిత సేవలు, డ్రైవింగ్ లైసెన్స్, ట్యాక్స్ తనిఖీ, ఫ్యాన్సీ నంబర్ బుకింగ్, నేషనల్ రిజిస్టర్ సేవలు, హోమోలోగేషన్, జాతీయ పర్మిట్, ఆలిండియా టూరిస్ట్ పర్మిట్, సీఎన్‌జీ తయారీదారు, వేగపరిమితి పరికరం తయారీదారు, ట్రేడ్ సర్టిఫికెట్ తదితర ఆన్‌లైన్ సేవలు పొందే అవకాశం కల్పించినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఉపాధి కోసం, వివిధ కారణాల రీత్యా బయట రాష్ట్రాలకు వెళ్లినవారు, ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి వచ్చినవారు ఈ పోర్టల్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్, చిరునామా మార్పులు, చేర్పులు, లైసెన్స బదిలీ లాంటి సేవలను సులభంగా పొందవచ్చు.

'సారథి'తో వేగవంతమైన సమాచారం

ప్రభుత్వం రెండో విడతలో నల్లగొండ జిల్లాలో సారథి అప్లికేషన్ ద్వారా సేవలు పొందేందు కు అవకాశం కల్పించింది. గత నెల ఆగస్టు 25 నుంచి నల్లగొండ, మిర్యాలగూడ రవాణాశాఖ కార్యాలయాలతో పాటు రాష్ట్రంలోని మరో 10కార్యాలయాల్లో సారథి సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని ఆదేశించారు. గతంలో స్టేట్ పోర్టల్ సీఎఫ్ఎస్‌టీ సాంకేతికతకు బదులుగా నేషనల్ ఇన్ఫర్‌మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని సూచించింది. దీనిద్వారా ఆర్‌టీవోల పని వాతావరణాన్ని మెరుగుపరచడం, పౌరులకు మెరుగైన సేవలు అందించడం, ఇతర ప్రభుత్వ విభాగాలకు డ్రైవింగ్ లైసెన్స్, వాహన సమాచారాన్ని త్వరగా చేరవేయడం చేయడానికి వీలువుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. సారథి డ్రైవింగ్ లైసెన్స్‌ల సమాచారం పొందేందుకు లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్, రెన్యువల్‌ను ఎంవీఐ కార్యాలయానికి వెళ్లకుండానే పోర్టల్ ద్వారా పొందే ఉంటుంది. పేపర్ వాడకాన్ని తగ్గిస్తూ, వేగవంతమైన అప్‌డేట్‌లతో పాటు డిజిటల్ యాక్సెస్ ద్వారా పారదర్శకతను పెంచడం చేస్తుందని అంటున్నారు. స్లాట్‌లను బుక్ చేసుకోవడానికి, ట్యాక్స్‌లను ఆన్‌లైన్‌లో చెల్లించడానికి వీలు కల్పిస్తుందని పేర్కొంటున్నారు.


సారథి సేవలను పూర్తిస్థాయిలో అమలులోకి తేవాలి



లెర్నర్ లైసెన్స్ పొందాలంటే ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లి పరీక్ష రాయాల్సివస్తోంది. సారథి సేవలు అమలులోకి వస్తే ఇంటి దగ్గర నుంచే రాసే వీలు కలుగుతుంది. లైసెన్స్‌ల రెన్యువల్ ఆన్‌లైన్ ద్వారానే పూర్తి చేయవచ్చు. ప్రజలకు ఉపయోగపడే సారథి అప్లికేషన్ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలి.

- ఎన్. రాంబాబు, మిర్యాలగూడ.

సమయం ఆదా అవుతుంది



డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ, వివరాల్లో మార్పుల కోసం అభ్యర్థన, వివిధ పన్నులు, ట్రాఫిక్ చలాన్‌ల చెల్లింపు లాంటి వాటి కోసం పౌరులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పోర్టల్ లోని రవాణా కార్యాలయ సేవలు పొందడం ద్వారా సమయాన్ని ప్రజలు ఆదా చేసుకోవచ్చు. ట్రాఫిక్ అధికారులకు వాహనాల సమాచారాన్ని అందించడానికి సహాయపడుతుంది.

- ఎల్. వీరాస్వామి ఎంవీఐ, మిర్యాలగూడ.

అందుబాటులోకి రాని వాహన్ రిజిస్ట్రేషన్లు

ప్రస్తుతం షోరూమ్‌ల్లో కొత్త టూవీలర్, ఫోర్‌వీలర్ వాహనాలకు టెంపరరీ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌కు ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఆర్‌సీకార్డులకోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సివస్తుంది. షోరూమ్‌ల్లోనే పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌లు చేస్తే వాహనదారులకు వ్యయప్రయాసాలు తప్పుతాయని అంటున్నారు.పరివాహన్ పోర్టల్ డీలర్ల వద్దనే వాహనాల రిజిస్ట్రేషన్స్ చేసుకునే వీలు కల్పిస్తుంది. పలు సాంకేతిక కారణాలతో అమలుకావడం లేదని తెలుస్తోంది.

సూర్యాపేట జిల్లాకు ఉత్తమ పురస్కారాలు



గడ్డం వెంకన్న, ఛత్రు నాయక్

ఆత్మకూర్(ఎస్), గరిడేపల్లి సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సూర్యాపేట జిల్లా వాసులు ఎంపికయ్యారు. సెప్టెంబరు 5న గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించింది. ఆ జాబితాలో సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన డాక్టర్ గడ్డం వెంకన్న, గరిడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాధికారి ఛత్రు నాయక్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. వెంకన్న 30 ఏళ్లుగా జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం డాక్టర్ గడ్డం వెంకన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో జానపదం గిరిజన విజ్ఞాన పీఠం విభాగానికి డీన్‌గా కొనసాగుతున్నారు. గరిడేపల్లి మండలవిద్యాధికారి పానుగోతు ఛత్రునాయక్ మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడుతండాలో 1997 యూపీపీఎస్ పల్లివాడలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరి, నాటి నుంచి పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. గరిడేపల్లి, మఠంపల్లి, పాలకవీడు మండలాల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టి సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలల్లో సుమారు 6 వేలు పైచిలుకు మొక్కలు నాటించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచడంలో విశేష కృషికి జిల్లా స్థాయిలో పలు అవార్డులను అందుకున్నారు. ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడం, ఆకస్మిక సెలవులను తప్ప ఇంతవరకు ఎలాంటి ఇతర సెలవులు వాడుకోలేదని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, టోల్ ఫ్రీ నంబరు 18005995991 ను తీసుకొచ్చిందని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నంబరు సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఇళ్ల లబ్ధిదారులు ఇంటికి సంబంధించిన బిల్లుల పరిస్థితి, ఇతర వివరాలను తెలుసుకునేందుకు యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. లబ్ధిదారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వారి స్టేటస్‌ను పరిశీలించుకోవచ్చన్నారు. ఫొటో తీసే పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు సృష్టిస్తే లబ్ధిదారులు అప్‌లోడ్ చేయవచ్చన్నారు. ఇందుకు వారి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుందని, ఆ నంబర్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆధార్ తప్పులకు సంబంధించి ఎంపీడీవోను సంప్రదించాలన్నారు.

'ఎన్ఐఆర్ఎఫ్'లో విజ్ఞాన్ యూనివర్సిటీకి 70వ ర్యాంకు



వివరాలు వెల్లడిస్తున్న వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ నాగభూషణ్

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో విజ్ఞాన్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో 70వ ర్యాంకు లభించినట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ నాగభూషణ్ తెలిపారు. దేశ్‌ముఖి గ్రామ శివారులో విజ్ఞాన్స్ యూనివర్సిటీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) జాతీయ స్థాయి ర్యాంకుల్లో ఈ ర్యాంకు లభించినట్లు చెప్పారు. ఇంజనీరింగ్ విభాగంలో సైతం 80వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. టీచింగ్ లెర్నింగ్ రిసోర్సెస్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్స్, ఔట్‌రీచ్ అండ్ ఇంక్లూజివిటీ, పీఆర్ పర్‌ఫెక్షన్ పనితీరును కేంద్రం పరిశీలించి 100 పాయింట్లను స్కోర్ ప్రామాణికంగా ర్యాంకులను కేటాయించిందన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు లభించడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ ఏజెన్సీల నుంచి గ్రాంట్‌లు అందుతాయన్నారు. అంతేకాకుండా ప్రముఖ బహుళ జాతి కంపెనీలు, వర్సిటీ విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయన్నారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేసిన ఐక్యూఏసీ బృందాలను, విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైసెచాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ. నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ. రావు అభినందించారు.


యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్ట భుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు వేద మంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విష్వక్సేనుడి తొలి పూజలతో కల్యాణతంతు కొనసాగింది. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 12,36,016 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

రూ. 4 కోట్ల విలువైన స్థిరాస్తి అప్పగింత



దస్తావేజులను స్వీకరిస్తున్న ఆలయ ఈవో వెంకట్రావు

హైదరాబాద్ తిలక్‌నగర్‌కు చెందిన ముత్తినేని వెంకటేశ్వర్లు 152 గజాల విస్తీర్ణంలో నిర్మితమైన రూ. 4 కోట్ల విలువైన మూడు అంతస్థుల(జీ ప్లస్ త్రీ) భవనానికి సంబంధించిన పత్రాలు గురువారం అధికారులకు అప్పగించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని చిక్కడపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం ఈవో ఎస్. వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తికి సంబంధిత పత్రాలను దాత అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదం దాతకు అందజేశారు.

స్టీల్ ప్లేట్లు అందజేత

చివ్వెంల సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను తరిమేసి పర్యావరణాన్ని కాపాడుకోవాలని వివేక ఫౌండేషన్ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. మండలంలోని కుడకుడలో వినాయక విగ్రహాల వద్ద నిర్వాహకులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, వీరయ్య, నారాయణ, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గడియారాలు పంపిణీ చేయడం అభినందనీయం

నూతనకల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అభ్యున్నతి కోసం గడియారాలు పంపిణీ చేయడం అభినందనీయమని ఎంఈవో రాములు నాయక్, నోడల్ అధికారి డి.శివయ్య అన్నారు. మండలంలోని ఎర్రపహాడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సామ సవేందర్‌రెడ్డి రూ. 20వేల విలువైన 72 మంది విద్యార్థులకు అందించిన గడియారాలను వారు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం అనంతుల కళావతి, వెంకటమ్మ, మాదవి, జ్యోతి పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించాలి



నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ప్రశాంతి, ఏవో

కోదాడరూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రైతులు నానో యూరియా వాడాలని స్ప్రే యూరియాతో దిగుబడి ఎక్కువగా ఉంటుందని సహాయ వ్యవసాయ సంచాకుడు ప్రశాంతి అన్నారు. పట్టణ పరిధిలోని తమ్మరలో గురువారం నానో యూరియాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నానో యూరియా వాడడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గుతుందని ఈ స్ప్రే ఆకుల మీద పడటం వల్ల వెంటనే ఫలితం ఉంటుందని పొలం ఏపుగా ఎదు గుతుందన్నారు. యూరియా మొక్కకు మొక్కకు మధ్య పడటం వల్ల అది ఉపయోగం లేకుండా పోతుందని అన్నారు. అనంతరం మగినం రాజు పొలంలో టెస్ట్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. రైతు సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు బొల్లు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏవో పాలెం రజని, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, ఏఈఓ నగేష్, మాజీ కౌన్సిలర్ సామినేని నరేష్, కనగాల శ్రీధర్, స్వామినేని వెంకటేశ్వర్లు, కనగాల కొండయ్య, మందరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామస్థుల సహకారంతో బల్బులు ఏర్పాటు



కార్యదర్శికి బల్బులు అందజేస్తున్న యువకులు

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండ గ్రామంలో కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలుగకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామ యువ కులు వాట్సాప్ గ్రూప్‌లో సమస్యపై పోస్టు చేశారు. అయితే కొందరు విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా నిధులు లేవని తెలిపారు. ఈ క్రమంలో గ్రామ యువకుడు ముక్కెర మహేష్ 100 ఎల్ఈడీ బల్బులు, బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ యజమాని పసుపులేటి వెంకన్న 30 బల్బులు, తల్లోజు భవనాచారి 20 బల్బులు, నీరటి ప్రవీణ్ వాటికి సంబంధించిన ఓల్డర్స్ అందజేశారు. వీటిని మార్పు సొసైటీ ఆధ్వర్యంలో సమన్వయపరిచి గురువారం పంచాయతీ కార్యదర్శి యాకూబ్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో దాతలు వెంకన్న, భవన చారి, గ్రామస్థులు రమేష్, మహేష్, నరేష్, మధు, రవి, యాదగిరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి కల్పనపై శిక్షణ

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు స్వయం ఉపా ధి కల్పన కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఒకరోజు శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ డీపీఎం బెనర్జీ, అరుణ్‌కుమార్, ఏపీఎం సైదయ్య, ఇద్దయ్య, ముత్తయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదరావు మృతికి పలువురి సంతాపం

కోదాడటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ది. కోదాడ లారీ అసోసియేషన్ సీనియర్ సభ్యుడు రేపాల ప్రసాదరావు(78)గురువారం మృతి చెందారు. దీంతో లారీ అసోసియేషన్ నాయకులు ప్రసాదరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు తూనం కృష్ణ, ప్రధాన కార్యదర్శి యలమందల నరసయ్య, పైడిమర్రి వెంకటనారాయణ, ఆవుల రామారావు, పెద్ది అంజయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

మస్రు మృతదేహానికి నివాళి

కోదాడరూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీక్యతండా మాజీ సర్పంచ్ బానోత్ అంబేద్కర్ తల్లి మస్రు గురువారం మృతి చెందారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, నాయకులు సీతారాం రెడ్డి మస్రు మృత దేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పశు వైద్యశాలలకు సిబ్బంది కొరత

● చింతలపాలెం మండలంలో ఇబ్బంది పడుతున్న పశుపోషకులు ● పశువైద్యాధికారులను నియమించాలని విజ్ఞప్తి



చింతలపాలెం మండలం దొండపాడు పశువైద్యశాల వేసిన తాళం

(ఆంధ్రజ్యోతి-చింతలపాలెం)

మండలంలోని పశువైద్యశాలల్లో డాక్టర్, సిబ్బ ంది లేక పోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 16 గ్రామ పం చాయతీలు ఉండగా మండల వ్యాప్తంగా ఆవులు, గేదెలు 7,500 వరకు, గొర్రెలు, మేకలు 13 వేల వరకు ఉన్నాయి. వీటికి వైద్యం చేయించడానికి దొండపాడు, తమ్మవరంలో పశువైద్యశాలలు ఉన్నాయి. అయితే మండలంలోని అన్ని గ్రామాల పశుపోషకులు వైద్యం కోసం ఈ వైద్యశాలలను ఆశ్రయిస్తుంటారు. దొండపాడు పశువైద్యాధికారి ఏడాది క్రితం, తమ్మవరంలో ఉద్యోగి ఆరు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆయా పశువుల దవాఖానలు తెరుచుకోవడం లేదు. దొండపాడులో మాత్రం డాక్టర్ పోస్టు ఉన్నప్పటికీ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో మరో డాక్టర్‌ను వేసేందుకు ఆ పోస్టును ఖాళీగా చూపకపోవడంతో పశుపోషకులు అవస్థలు పడుతున్నారు. ఇన్‌చార్జి పశువైద్యాధికారిని నియమించడంతో అతడు వారంలో రెండు రోజులు మాత్రమే సేవలు అందిస్తున్నాడు.

ఇటీవల ఆవులు, ఎద్దులు, దూడలకు ముద్ద చర్మ వ్యాధి సోకుతోంది. ఈ వ్యాధి సోకిన వెంటనే టీకాలు వేయించాలి. లేకపోతే పశువులు మృత్యుబారిన పడతా యి. దీంతో పశుపోషకులు, ప్రభుత్వ పశువైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో డబ్బు దుస్థితి నెలకొంది .

వారంలో రెండు రోజులు వైద్యం అందిస్తున్నా..



మండల ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ బి మధును వివరణ కోరగా తన అసలు పోస్టింగ్ కోదాడ మండలం ఎర్రవరం గ్రామంలో ఉండగా, చింతలపాలెం మండలం దొండపాడు, తమ్మవరం గ్రామాల పశువైద్యశాలలకు ఇన్‌చార్జి వైద్యాధికారిగా నియమించారు. వారంలో రెండు రోజులు ఆ వైద్యశాలను సందర్శించి పశువులకు వైద్యం అందిస్తున్నా.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బెజవాడ వెంకటేశ్వర్లు



సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జిల్లాకు చెందిన బెజవాడ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలో నిర్వహించిన పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభలో వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో సీపీఐ ముందువరుసలో ఉంటుందన్నారు.

పత్తి దిగుమతి సుంకం రద్దు చేయడం విరమించుకోవాలి

నూతనకల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేయడాన్ని విరమించుకోవాలని కోరుతూ గురువారం ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్, సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంట నాగయ్య, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, దేశోజు మధు, శ్రీనివాస్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ సేవలు మరువలేనివి



కోదాడ తేజ విద్యార్థుల వినూత్న ప్రదర్శన

కోదాడటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : దేశానికి మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ రా దాకృష్ణ సేవలు మరువలేనివని తేజ స్కూల్ ప్రిన్సిపాల్ అప్పా రావు అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తేజ టాలెంట్ స్కూల్లో రాధాకృష్ణన్ చిత్రపటానికి విద్యార్థులు ఉ త్సాహంగా మణిహార రూ పంలో వినూత్నంగా ప్రదర్శన ఇచ్చారు. అంతేకాకుండా గురువు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సెక్రెటరీ ఎర్రంశెట్టి సంతోష్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం. అప్పారావు, హైస్కూల్ ఇంచార్జి రామ్మూర్తి, ప్రైమరీ ఇంచార్జి రేణుక, మేడం నవ్య మేడం పావని, లావణ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాల అధ్యాపకులకు సన్మానం

నేరేడుచర్ల : సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక రోజు ముందుగా గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకున్నారు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పర్రెడ్డి వెంకటరమణ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు కర్నాటి శ్రీనివాసులు, కె. ప్రణతిను శాలువాతో సత్కరించా రు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు, కేఎల్ఎన్‌రావు, వెంకన్న, సునీత, నరేందర్, అంజయ్య, సుశాంత్, వెంకన్న, జానఫ్ ఖాన్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు చేపట్టాలి



నూతనకల్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు

నూతనకల్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): నూతనకల్ నుంచి వెంకేపల్లి గ్రామ రహదారికి మర మ్మతు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో పదేళ్లుగా ఒక గుంతను పూడ్చలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కూడా రోడ్లను పట్టించుకోకుండా స్థానిక ఎమ్మెల్యే కాలయాపన చేయడం శోచనీయమన్నారు. వెంకేపల్లి రోడ్డ మోకళ్లలోతు గుంత ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుత ఎన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.యాదగిరిరావు, సత్యం, కందాళ శంకర్‌రెడ్డి, బి.శ్రీను, బి.జనార్ధన్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, తిరుమల్, వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్, లింగయ్య పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో యూరియా అందించాలన్నారు. యూరియా లభించక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో రైతులను ఆదుకోవాలన్నారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ పట్ల నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రెండేళ్లుగా ముఖ్యంగా ఆయకట్టు ప్రాంతంలోని రైతులు వానాకాలంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సహకార సంఘం ద్వారా రైతులకు యూరియా అందించాలన్నారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. సమావేశంలో వెంకటచంద్ర, గోపరాజు, చందాల భిక్షం, తిరపతయ్య, రాములు, శ్రీను, సొంబయ్య, మురళి, పాల్గొన్నారు.

డివిజినల్ స్థాయి క్రీడలకు 18 మంది గురుకుల పాఠశాల విద్యార్థులు

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఏపూర్‌లో నిర్వహించిన మండల స్థాయి పాఠశాల అండర్- 17, 14 క్రీడల్లో మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 2, 3న నిర్వహించిన క్రీడల్లో కబడ్డీ సీనియర్, జూనియర్‌లలో విజయం సాధించి డివిజనల్ స్థాయి కి 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఆయన అభినందించారు.

పేదలకు ఇళ్లు మంజూరుచేయాలి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పోసనబోయిన హుస్సేన్, దుగ్గి బ్రహ్మం అన్నారు. గురువారం లింగగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో వీరస్వామి, శ్రీను, పుల్లయ్య, బాబు, లక్ష్మయ్య, వెంకన్న, సైదమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

‘పేట’లో అర్జున్ చక్రవర్తి బృందం సందడి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తిరుమల మల్టీప్లెక్స్‌లో అర్జున్ చక్రవర్తి చిత్ర బృందం గురువారం సందడి చేసింది. అర్జున్ చక్రవర్తి డైరెక్టర్ విక్రాంత్ రుద్ర ప్రదర్శనను ప్రజలతో కలిసి వీక్షించి అనంతరం ఆయన మాట్లాడారు. మోతె మండలం ఉర్లుగొండ గ్రామం నుంచి తెలుగు సినిమాకు దర్శకత్వం వహించే స్థాయికి ఎదగడం గొప్పగా ఉందన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన కబడ్డీ క్రీడాకారుడి జీవిత చరిత్రను ఆధారంగా చేసుకొని అశోక్‌చక్రవర్తిని చిత్రీకరించామని ప్రస్తుతం 250 థియేటర్‌లో ప్రదర్శించ బడుతుందన్నారు. కార్యక్రమంలో చామకూరి ఉప్పయ్య, సీతమ్మ, నరేష్, కాంపాటి రాధాకృష్ణ, యాదగిరి, అభిమానులు పాల్గొన్నారు.

‘విద్యా జ్యోతి’ సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి, సెప్టెంబరు 4, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆ బ్యాంకు మేనేజర్ వెం గళరావు తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతిని అందజేసి మాట్లాడారు. ప్రతిభ గల విద్యార్థులకు ఈ బహుమతి అందజేస్తున్నట్లు చెప్పారు ఉత్తమ ప్రతిభ కనబర్చిన 5,6,7 తరగతుల విద్యార్థులకు రూ. 3 వేల చొప్పున, 8,9,10 తరగతుల విద్యార్థులకు రూ. 5వేల నగదు అందించారు. ఆయనతోపాటు ప్రిన్సిపాల్ సంధ్యారాణి బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేం‘దయా’్య!

(3వ పేజీ తరువాయి)

కొరత తీవ్రమైంది. అధికారులు యూరియా కొరత లేదని చెబుతున్నా రైతులకు మాత్రం అందడంలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎరువుల కొరత ఉండటంతో రైతాంగానికి ఎటూ తోచడం లేదు. దుకాణాలు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం ఉండటంత లేదని రైతులు వాపోతున్నారు.


ఎదురుచూపులు, ఆందోళనలు

జిల్లాలో యూరియా కొరత అధికంగా ఉండడంతో రైతులు ఆగ్రహంతో రోడ్డెక్కుతున్నారు. మండల కేంద్రాల్లోని పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు నిత్యం పడిగాపులు పడుతున్నారు. ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అక్కడే ఉంటూ నిరీక్షిస్తున్నారు. ఇటీవల సూర్యాపేట మండల కేంద్రంలోని సీతారాంపురం పీఏసీఎస్ సెంటర్ ఎదుట రైతులు ఆందోళన నిర్వహించారు. రోడ్డెక్కి యూరియా కోసం ఆందోళన చేయడంతో పోలీసులు సర్దిచెప్పారు. ఇలా నిత్యం ప్రతీ మండలంలో రైతుల ఎదురుచూపులు, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

ధాన్యం దిగుబడిపై ప్రభావం

పంటకు సకాలంలో యూరియా అందించకపోతే ధాన్యం దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల ఎడమ కాల్వ, మూసీ నుంచి సాగునీటిని విడుదల చేయడంతో ఇప్పటికే సిద్ధంగా ఉంచుకున్న నార్లను రైతులు నాటేశారు. అటు ఆయకట్టుతోపాటు నాన్ ఆయకట్టు రైతాంగానికి యూరియా అవసరం అధికంగా ఉంది. పంటకు సకాలంలో ఎరువులు అందించకుంటే ధాన్యం దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదటి దశ ఎరువులు వేయాల్సిన రైతులతోపాటు వరి కంకులు పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో ఎరువుల వినియోగం అధికంగా ఉంటుంది. అయితే అందుబాటులో ఎరువులు లేకపోవడంతో రైతులకు ఎటూ పాలుపోవడం లేదు. వరి సాగుకు తోడు జిల్లాలో సుమారు 65వేల హెక్టార్లలో పత్తి సాగైంది. పత్తి పంటకు కూడా కొంత మేర యూరియా అవసరం ఏర్పడింది.

రైతులు ఆందోళన చెందవద్దు



జిల్లాలో యూరియాకు కొరత లేదు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. వరి సాగు ఒకేసారి అధి క మొత్తంలో చేయడంతో రైతులంతా యూరియా కొనుగోలుకు ఒకేసారి వస్తుండటంతో ఇబ్బందులు తలెత్తాయి. జిల్లాకు అవసరమైన యూరియా విడతల వారీగా సరఫరా అవుతోంది. ఎవరైనా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. పీఏసీఎస్ కేంద్రాలతో పాటు డీలర్ల వద్ద సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయి. -శ్రీధర్‌రెడ్డి, డీఏవో

గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

(3వ పేజీ తరువాయి)

సీసీ కెమెరాల నిఘాతో పర్యవేక్షించనున్నారు.

మద్యం దుకాణాల బంద్

గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ అధికారులు జిల్లాలో మద్యం దుకాణాలను శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు బంద్ చేయాలని ఆదేశాలు జారీచేశారు.

నిమజ్జన ప్రదేశాలు ఇవే.

జిల్లాలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అధికారులు ప్రత్యేకంగా ఎనిమిది ప్రదేశాల్లో ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు మినీట్యాంక్ బండ్, సూర్యాపేట మండలంలోని మూసీ ప్రాజెక్టు, కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు, మఠంపల్లి సమీపంలోని కృష్ణానది, పాలకీడు మండలంలోని మహంకాళిగూడెం కృష్ణానది, నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద మూసీ నది, అనంతగిరి మండలంలో పాలేరు వాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేశారు. ఇవేగాక మండలాలు, గ్రామాల్లో మరో 30 ప్రదేశాల్లో చెరువులు, కుంటల్లో కూడా గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఈసారి నాగార్జునసాగర్ ఎడమకాల్వలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే అవకాశం లేదు. తాగునీటి అవసరాలకు ఉపయోగించే కాల్వలు, ప్రాజెక్టులు, చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనాన్ని నిషేధించారు. దీంతో నాగార్జునసాగర్ కాల్వతో పాటు పులిచింతల ప్రాజెక్టులో కూడా నిమజ్జనం చేయడానికి వీలులేదు.

ప్రశాంతంగా శోభాయాత్రను నిర్వహించాలి

జిల్లాలో గణేష్ శోభాయాత్రను భక్తులు ప్రశాంతంగా నిర్వహించాలి. తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం సంతోషదాయకం. గణేష్ నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నాం. నిమజ్జనానికి తరలించే వాహనాల్లో చిన్నారులను అనుమతించవద్దు. విగ్రహాలకు ఉదయం సమయంలోనే పూజలు పూర్తి చేసి నిమజ్జనానికి తరలించాలి. ఎక్కడ కూడా ఘర్షణ వాతావరణానికి అవకాశం ఇవ్వవద్దు. ప్రజలు నిమజ్జనాన్ని వీక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. -తేజస్‌నందలాల్ పవార్, కలెక్టర్

కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు



సూర్యాపేటలో అన్నదానం ప్రారంభిస్తున్న నాయకులు చిత్తలూరి కృష్ణగౌడ్, ఎడ్ల గంగాభవాని పీరమల్లు

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని 11వవార్డులో బీఆర్ఎస్ నాయకులు చిత్తలూరి కృష్ణగౌడ్, మాజీ కౌన్సిలర్ ఎడ్ల గంగాభవాని రాయిగూడెం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం ప్రారంభించారు. 9వ వార్డులో మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, 5వవార్డులో బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్, ఉప్పల ఆనంద్, భాషా, జీడి భిక్షం గణేశుడి వద్ద పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు

రూ. 1.15 లక్షలు పలికిన లడ్డూ

నేరేడుచర్ల : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నేరేడుచర్ల జాన్‌పహాడ్ ఆర్చి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద లడ్డూను గురువారం వేలం వేశారు. మండల కేంద్రానికి సుమంత్ రూ.1,15,116కు పాటపాడి లడ్డూను దక్కించుకున్నాడు. అలాగే జాన్‌పహాడ్ రోడ్డులో ఏర్పాటు చేసిన మరో మండపం వద్ద తాపేశ్వరం లడ్డూ, వెండి కలశం, స్వామి వారి వస్తువులు, వస్త్రాలు వేలంనిర్వహించారు. వెండి కలశాన్ని గజ్జల రామసింధూర్, మౌనిక దంపతులు రూ.51,106లు, లడ్డూను రూ. 40,116లకు మూలగుండ్ల వెంకటరెడ్డి, పట్టు వస్త్రాలు రూ. 6,606లకు పొలిశెట్టి ఈశ్వరయ్య, పొలిశెట్టి వినయ్, స్వామి వారి హుండీని రూ. 8,706లకు రాయికింది సురేష్, రమ్య దంపతులు, తొలి కొబ్బరి రూ. 20,106లకు యాద బాలయ్య, యాద నాగశేఖర్ దక్కించుకున్నారు.

● మఠంపల్లి : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల నలుమూలనుండి భారీ సంఖ్యలో విగ్రహాలు తరలిరావడంతో మట్టపల్లి క్షేత్రం వద్ద జైబోలో గణేష్ మహారాజ్ కీ జై అంటు మార్మోగింది. మండలంలోని మఠంపల్లి, పెదవీడు, మట్టపల్లి, చౌటపల్లి, బక్కమంతులగూడెం, రామచంద్రాపురంతండా,రఘునాథపాలెం, బీల్యానాయక్‌తండా, యాతవాకిళ్ల వర్ధాపురం తదితర గ్రామాల్లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.